క్లుప్తంగా

ఆలయంలో వెండి కవచం చోరీ



అలంపూర్ : మండల పరిధిలోని లింగన్‌వాయి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహ వెండి కవచాన్ని శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఆలయంలో పని చేస్తున్న కురువ జయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి : మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. పూజా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి

అయిజ: మండల స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ ఆటల పోటీల్లో క్రీడాకారులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనదలచిన వారు. ఈ నెల 9 లోపు ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

గద్వాల(గట్టు) : మండల పరిధిలోని పెంచికల పాడు గ్రామంలో శుక్రవారం నడిపి ముసిలప్పకు చెందిన గుడిసె అగ్నికి అహుతైంది. గ్రామానికి చెందిన ముసిలప్పకు చెందిన గుడిసె విద్యుత్ వైర్ల కారణంగా నిప్పంటుకున్నట్లు బాధితులు తెలిపారు. ప్రమాదంలో ఒక మేక కూడా చనిపోయింది. సుమారు రూ. 50 వేల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు పేర్కొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ సమావేశం

అలంపూర్ : ఈ నెల 7వ తేదిన మార్కెట్ యార్డ్ కమిటీ సాధారణ సమావేశం జరుగనున్నట్లు కార్యదర్శి ఎల్లస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డ్ సమావేశ మందిర భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉన్నట్లు తెలిపారు. సమావేశానికి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్‌తోపాటు డైరెక్టర్లు హాజరవనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా షమీర్

గద్వాల(ధరూరు) : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉప్పేరు గ్రామానికి చెందిన షమీర్ ముజాహిద్ ఎన్నికయ్యారు. రెండు నెలల క్రితం నిర్వహించిన ఓటింగ్ ఫలితాల్లో ఎన్నికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండల అధ్యక్షుడిగా తనను ఎన్నిక చేసినందుకు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్యకు, సహకరించిన మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పాడె మోసిన ఎమ్మెల్యే



ఉండవెల్లి: మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి జయ్యన్న అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వారి భౌతిక దేహానికి ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఐపీఎస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. అండగా ఉంటామని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల అరెస్ట్

అయిజ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం సందర్శించేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు వీరేష్, మాధవ్, రాజు తదితరులు ఉన్నారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో..?

- రెండేళ్ల క్రితం మంజూరైన పనులు
- డివైడర్ కం సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు రూ.1.50 కోట్లు మంజూరు
- రూ.70 లక్షల చెక్కు పాస్ కాని దుస్థితి



శాంతినగర్‌లో కంకరమయంగా మారిన రోడ్డు

శాంతినగర్ : గ్రామ పంచాయతీకి బదులుగా మున్సిపాలిటీ అయిందని సంతోషించాలో, అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయి సమస్యలతో సతమతమవుతు బాధపడాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని వడ్డేపల్లి మున్సిపాలిటీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు వరాలైతే కురిపించారుగాని అందుకు తగ్గ నిధులు కేటాయించక పోవడంతో పంచాయతీగా ఉన్నప్పుడే బాగుందని పన్నుల భారం ఎక్కువైందని, సౌకర్యాలు మాత్రం అధ్వాన్నంగా ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు మున్సిపాలిటీ వాసులు.

రూ.1.50 కోట్లు మంజూరు..

మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, డివైడర్ కం లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడానికి రెండేళ్ల క్రితం ప్రొసీడింగ్స్ మంజూరు చేశారు. సీసీ రోడ్లు, అక్కడక్కడా డ్రెయిన్‌ల పనులు మాత్రం చేపట్టారు. డివైడర్ కం లైటింగ్ సిస్టమ్, రోడ్డు వెడల్పు పనులు చేపట్టడానికి గాను రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ అలంపూర్- రాయచూర్ రోడ్డుకు ఇరువైపుల వెడల్పు చేసే పనులు మొదలుపెట్టారు. ఇరువైపుల గోతులు తవ్వి కంకర వేసి రోడ్డు వెడల్పు చేస్తున్నారు అంతలోనే పట్టణ వాసులకు సమస్యలు తలెత్తాయి.

మధ్యలోనే నిలిపేసిన పనులు..

బిల్లులు రాలేదంటూ కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశాడు. దీంతో ఇరువైపుల రోడ్డంతా కంకర తేలి ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. కాలినడకన నడిచేందుకు కూడా ఇబ్బందికరంగా మారింది. అసంపూర్తి పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని పట్టణ వాసులు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్‌శాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి, అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



శాంతినగర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు

కంకర రోడ్లతో ఇబ్బందులు ..



మున్సిపాలిటీలో కాలి నడకన కూడా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. ఇరువైపుల కంకర వేసి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బీటీ వేస్తారని, రోడ్డు వెడల్పు అవుతుందని ఆశించాము. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తిచేసి సమస్య పరిష్కరించాలి.

-మాదన్న, వడ్డేపలి

ట్రాఫిక్‌తో అవస్థలు..



రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డు మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేయడం, ఇరువైపుల బీటీ వేయకపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలి.

- ఆంజనేయులు, జూలెకల్

సగం పనులు పూర్తి..

రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ సగం వరకు పనులు పూర్తి చేశాడు. చేసిన పనులకు సంబంధించి రూ.70 లక్షలకు పదినెలల క్రితం చెక్కు ఇచ్చారు. నిధులు లేకపోవడంతో చెక్కు పాస్ కాలేదు. ఉన్నతాధికారులు నివేదికలు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేయిస్తాం.

-రాజయ్య, మున్సిపల్ కమిషనర్, వడ్డేపల్లి

బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

అలంపూర్ : రాష్ట్రంలోని 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభల సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 317 జీఓ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత విధానాన్ని కొనసాగించడం విడ్డూరంగా ఉందన్నారు. గత రెండేళ్లుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడదల చేయాలన్నారు. గత రెండేళ్లుగా సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్, జీఎల్‌ఐ తదితర బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. ఈ నెల 8వ తేదిన అలంపూర్‌లో జరిగే జిల్లా మహసభలను విజయవంతం చేయాల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిప్రసాద్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

గద్వాల(మల్దకల్) : వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ ఫ్రిన్స్ ఆర్గనైజేషన్ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు శారీరక మార్పులకు అనుగుణంగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వరలక్ష్మీ, గిరిబాబు, ఉపాధ్యాయులు జాకీర్‌హుసేన్, రాజేశ్వర్, సుభాన్, భాస్కర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గద్వాల(ధరూరు) : జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ధరూరుకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన రగ్బీ సెలక్షన్లలో గద్వాల జిల్లా తరఫున ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన తిరుమలేష్, ఉరుకుందమ్మలు ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి బీహార్ పాట్నాలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున హాజరు కానున్నట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి హృదయరాజ్

మానవపాడు: కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా నోడల్ అధికారి హృదయరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని అధ్యాపకులకు సూచించారు. అధ్యాపకులు తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఉత్తీర్ణత తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. 90 రోజుల ప్రణాళికల అమలు పర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పద్మావతి, అధ్యాపకులు వెంకటకృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



నూతన ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్న విద్యుత్ అధికారులు

అయిజ: మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొన్ని కాలనీల్లో లోఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు కొత్త బస్టాండ్ ప్రాంతంలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపుల వ్యాపార దుకాణాలు, వ్యాపార సంస్థలు ఉండడం వలన విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడంతో లోఓల్టేజీ సమస్య తలెత్తుతోందన్నారు. సమస్య ఉన్న ప్రదేశాల్లో 100 కేవీ స్థానంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతామని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సర్వోత్తం, లైన్‌మెన్ శివ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ యాకుబ్‌బాషా

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ.. అర్‌ఐ హెడ్‌కౌంట్ సర్వలెన్స్ మైక్రో యాక్షన్ ప్లాన్‌పై గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు జరగాలని సూచించారు. అన్ని రకాల వ్యాక్సిన్లు ఇవ్వడంపై ఇంటింటి సర్వే చేసే విధానం ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. బాలింతలను పర్యవేక్షణ చేసి ఆరోగ్య సూచనలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెలెన్, చంద్రన్న, అక్కమ్మ, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

గద్వాల(ధరూరు) : మండల పరిధిలోని పెద్దపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. పాఠశాల రికార్డులు, ఇటీవల నిర్మించిన ఆదర్శ అమ్మ పాఠశాల మరుగుదొడ్లు పరిశీలించారు. మరుగుదొడ్లను ఎల్లవేళలా శుభ్రంగా ఉంచాలని సూచించారు. వంట గదిని పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ బతుకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



గట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల(గట్టు) : ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బల్గెర హనుమంతు డిమాండ్ చేశారు. శుక్రవారం గట్టులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. రైతు సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరిని సాగు చేసిన రైతుల కష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రామునాయుడు, వెంకటేష్, మల్లికార్జున్, బాసు గోపాల్, భాస్కర్, సామేలు, కృష్ణ, గంగాధర్, వీరేష్, నర్సింహులు, తిమ్మారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల(ధరూరు) : మండలంలో మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం తహసీల్దార్ వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. ఉప్పేరు పీహెచ్‌సీలో మూతబడిన నేచురోపతిని తిరిగి ప్రారంభం చేయాలని సీపీఎం మండల నాయకులు మోష కోరారు. మండలంలో 70వేల జనాభా ఉందని, అందుకు అనుగుణంగా మండలంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాఇన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్న ఒక్క ఆసుపత్రిలో సరైన వైద్యం అందక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహులు, గోవిందు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాతా



గువ్వలదిన్నెలో ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

గద్వాల(కేటీదొడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను శుక్రవారం మండలంలోని గువ్వలదిన్నె, గంగన్‌పల్లి ఇర్కిచేడుతండా గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు రాహుల్ ఆధ్వర్యంలోని కళాకారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీల అమలుపై 19 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాకారులు భూపతి, రమాదేవి, హజ్రత్, కృష్ణ, రాహులు, కవిత, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌పై విద్యార్థులకు అవగాహన



సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

అయిజ: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని శుక్రవారం మల్దకల్ మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సందర్శించారు. రసాయన ఎరువుల గోదాం, పురుగు మందుల దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) రైతుల కోసం పనిచేసే విధానం గురించి వివరించారు. అనంతరం పీఏసీఎస్ పరిధిలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి మల్లేష్, సిబ్బంది జీవన్, రాజు, శిరీష, దీప్తి, శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్, ఉపాధ్యాయులు శిరీష, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుల తల్లి సరస్వతి మాతా విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. పాఠశాల పూర్వపు విద్యార్థులు 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్వర్ హుల్‌హక్, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ సుధాకర్, ఉపాధ్యాయులు, విగ్రహదాతలు, పాఠశాల పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



ఇర్కిచేడులో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కొండేరులో నివాళులర్పిస్తున్న నాయకులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి

సాక్షి నెట్‌వర్క్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు యువతకు దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, డీటీడీసీ నర్సింహ్మ, మాజీ పంచాయితీ రాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ బండారీ భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, బీఆర్‌ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బల్గెర ఏసన్న, వెంకటేష్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు ధర్మతేజ, సమసేవా ట్రస్టు సభ్యుడు డాక్టర్ భాస్కర్, బీజేపీ నాయకుడు రాజగోపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొంకల భీమన్న, జేఏసీ నాయకుడు రామ్మోహన్, వీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ తదితర నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



ఇటిక్యాలలో నాయకుల నివాళి



బల్గెరలో నివాళులర్పిస్తున్న నాయకులు



బిజ్వారంలో నివాళులర్పిస్తున్న ప్రజలు



శాంతినగర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు